# ఆకాశంలో అర్ధభాగం



డా॥ పి. విజయలక్ష్మి పండిట్

# ఆకాశంలో అర్ధభాగం

(కవితా సంపుటి)

డా. పి. విజయలక్ష్మి పండిట్

ఆర్.సి. రెడ్డి పబ్లికేషన్స్
హైదరాబాద్ - 500 020

## AAKASAMLO ARTHABHAGAM

by **Dr. P. Vijayalakshmi Pandit**

*First Published :* **July, 2009**

*Copyright :* **© Dr. P. Vijayalakshmi Pandit**

*Price :* **Rs. 70/-**
**$ 10**

*Published by :*

**R.C. Reddy Publications**
Ashok Nagar Cross Roads,
Hyderabad-20. Phone : 040-27600815

*For Copies :*

**Vishalandhra Publishers**
4-1-435, Bank Street, Vignan Bhavan,
Hyderabad and **Branches**

**Prajasakti Book House,**
H.No. 1-1-187/1/2, Chikkadapally, Hyderabad-20.
Phone : 040-27660013, 27635136

**Navodaya Book House,**
Opp. Arya Samaj Mandir,
Kachiguda, Hyderabad-27.

*Cover Design Painted by :*

**Dr. P. Vijayalakshmi Pandit**

*Printed at :*

**Om Sai Graphics**
Narayanaguda, Hyderabad-27.
A.P. INDIA.

# ఇందులో ...


| | | |
|---|---|---|
| 1. | ఆకాశంలో అర్ధభాగం | 1 |
| 2. | తీరని కోరిక | 4 |
| 3. | ఆడపిల్లనట | 6 |
| 4. | వలస పక్షులు | 8 |
| 5. | బాల్య వివాహం | 10 |
| 6. | జీవితం పూసింది | 13 |
| 7. | బోన్సాయ్ బ్రతుకు | 15 |
| 8. | సర్రొగేట్ మదర్ | 19 |
| 9. | మాయని మచ్చ | 21 |
| 10. | జోగిని | 23 |
| 11. | కంచే చేను మేస్తే! | 25 |
| 12. | ప్రేమోన్మాదం | 26 |
| 13. | బలవంతపు మరణశాసనం | 29 |
| 14. | సగటు స్త్రీ | 31 |
| 15. | మరణం అంచున | 33 |
| 16. | ప్రపంచీకరణ | 35 |

17. అమ్మ దినచర్య 38

18. నేనూ మనిషినే 40

19. ఎక్కడి వాళ్ళీ అనాథ బాలలు? 54

20. శిశిరం రాల్చిన కుసుమం 56

21. స్త్రీ వాదం 58

22. ఓ.... ఏడమ్ 60

23. అచేతన మహిళలు 65

24. సగటు'నాన్న' 67

25. హృదయం మరణించింది 69

26. 20 లీటర్ల నీరు = ఆరు కిలోమీటర్లు 71

27. అమ్మతనం 73

28. ఓ స్త్రీ ఎవరుతుడవాలి నీ కన్నీటిని ? 75

29. మేలి ముసుగు 77

30. నీ (స్త్రీ) జన్మహక్కు 81

# విజయ కింకిణి

స్త్రీలపట్ల సమాజం చూపుతున్న వివక్షకు అక్షర రూపం 'ఆకాశంలో అర్థభాగం'.

కవితలన్నింటిలో అంతస్సూత్రం స్త్రీ. ఆడపిల్ల పుట్టుక, బాల్యం, యవ్వనం, వివాహం, మాతృత్వం, వృద్ధాప్యం - ఇలా స్త్రీ జీవిత ప్రస్థానంలో వివక్ష అనుభవిస్తూనే అడుగు ముందుకేస్తోంది అనేది వాస్తవం.

స్త్రీ పురుష సమానతని అర్థనారీశ్వరతత్వం ప్రతీక అని, స్త్రీ పురుషులు జీవిత భాగస్వాములే అని తరతరాలుగా వింటూనే ఉన్నాం. ప్రపంచవ్యాప్తంగా అన్ని రంగాలలో ప్రగతి సాధించినా, స్త్రీ పురుషుల మనోభావాలలో ప్రగతి సాధించలేక పోయామనేది అందరి అనుభవమే. కుటుంబపరంగా స్త్రీ ఎదుర్కొనే సమస్యలు, సమాజపరంగా స్త్రీల అణచివేతను గమనిస్తున్న రచయిత్రి ఆవేదన కవితారూపంగా పెల్లుబికి, ఆకాశాన్ని తాకింది. సామాజిక స్థితిగతులకు అద్దంపట్టే కవితలే అన్నీ.

అమ్మ కడుపులోనే ఆడపిల్లకి సమాధి కట్టేస్తుంటే, ఆడవాళ్ళ ఆనవాళ్ళు లేకుండా పోతే, సృష్టి క్రమం ఆగిపోతే - భవిష్యత్తును ఊహించుకోండి - గుండె బరువెక్కక తప్పదు. అందుకే 'తస్మాత్ జాగ్రత్త' అని రచయిత్రి హెచ్చరిక చేసి, మనుగడకే ముప్పు వాటిల్లుతుందనే బాధను వ్యక్తం చేశారు 'ఆకాశంలో అర్థభాగం'లో.

మానవ జీవితంలో అందరికీ మధురాతిమధురమైన దశ బాల్యం. బాల్యంలో అ, ఆలు దిద్దటం అయింది. ఆడతనం ఆక్రమించుకుంది. ఇల్లాలైంది. అమ్మ అయింది - అంతే, చదువు 'తీరని కోరిక' అయింది. బాల్య వివాహాలు

ఇంకానా అని ఆశ్చర్యపోవద్దు. ఇంకా జరుగుతూనే ఉన్నాయి. సంస్కర్తలు తీసిపారేసిన దురాచారాలు మళ్ళీ తలెత్తుతున్నాయి. స్త్రీల పాలిట కల్పతరువు గురజాడ అప్పారావు గారు 'ఈ సమాజంలో స్త్రీల కన్నీటి గాథలకు కారణం నాకు తెలుసు. తిరిగి వివాహమాడకూడదనే నియమం. విడాకులు లేని కారణం. ఆర్థిక స్వాతంత్ర్యం లేకపోవడం స్త్రీల కన్నీటి గాథలకు హేతువులు' అన్నారు. ఇవన్నీ చాలావరకు సాధించాం - కానీ కన్నీటి గాథలు ఆగిపోయాయా, మళ్ళీ సంస్కర్తలు పుట్టుకురావాలా ॥ -

'పుట్టుకతోనే ఆడపిల్లకు
మోయలేని భారం
మొదలవుతుంది
జీవిత పోరాటం' - ఇంకెక్కడి బాల్యం॥

రచయిత్రి బొన్సాయ్ కళ గురించి హృదయవిదారంగా తెల్పారు. ఎదుగదలను అడ్డగించటమనే దాని ప్రతీక బొన్సాయ్.

కట్టుబాట్లు
సంప్రదాయాల
ఆంక్షల కత్తెళ్ళతో
ఆడపిల్లల శరీరాలకి,
మనస్సుకు
స్వేచ్ఛకు కత్తెర్లేస్తూ -

అని ఆడపిల్లను పెంచే కళ, బొన్సాయ్ కళ ఒకటే' అని స్త్రీల అణచివేతను అద్భుతంగా చిత్రీకరించారు రచయిత్రి.

ఆడపిల్లని కనద్దని అత్త, భర్త వేధింపులు

ఆడపిల్ల పుట్టింది!!

దానికి తమ్ముడూ పుట్టాడు!! - వాడు మగమహారాజు!!

కానీ చిత్రమేమిటంటే,

కడుపులో బిడ్డ ఆడ, మగ అని ఆలోచిస్తున్న తల్లి,

'నేనూ ఆడదానినైనా

మగ బిడ్డయితే మేలని

రహస్యంగా మనస్సు సందేశం'' - అమ్మ మనసులోంచి పుట్టిన ఆవేదనా అంతరంగ తరంగం అది!!

ఆడబిడ్డ మనషే కదా - ఎందుకీ వివక్ష ? - ఇది వీడని ప్రశ్న, సమాధానం రాని ప్రశ్న, తరతరాలుగా అందరూ ప్రశ్నిస్తున్న మహా ప్రశ్న! ఈ ప్రశ్నకు సమాధానం మానవత్వం ఆకాశమంత ఎత్తు ఎదిగినపుడే!

కంచే చేను మేస్తోంది - కన్నతండ్రి కామాంధుడు

ప్రియుడే ప్రేమోన్మాది!!

పసిపిల్లలపై లైంగిక వేధింపు!! - ఈ వికృతత్వానికి విరుగుడు చట్టాలు, శాసనాలు కావు, మనిషిని మనిషిగా గుర్తించడం వచ్చినపుడే, అంతవరకు ఆకాశంలో అర్థభాగం ఎదురు చూడాల్సిందే!!

మహిళల బతుకులను అభద్రతా భావంలోకి నెట్టివేస్తున్న ప్రపంచీకరణ గురించి ఆలోచించండంటారు రచయిత్రి. 'విశృంఖల విదేశీ సంస్కృతుల వెల్లువ'లో కొట్టుకు పోయేముందు ఒక్క నిమిషం ఆగండి' అంటారు ఒక ఆదర్శప్రాయమైన హితవరిలాగ రచయిత్రి విజయలక్ష్మి పండిట్ గారు.

స్త్రీలందరూ తమ కన్నీళ్ళు తామే తుడుచుకుని ముందుకు సాగిపోటమే కర్తవ్యం. అదే మహిళా సూక్తం!!

విజయలక్ష్మి పండిట్‌గారు స్త్రీవాదాన్ని ఎంత సరళంగా, సంక్షిప్తంగా నిర్వచించారంటే, తియ్యని, చల్లని మంచినీళ్ళు తాగినంత హాయిగా ఉంది చదువుతుంటే.

స్త్రీలనణగదొక్తినంత కాలం
దేశాభివృద్ధి కల్లని
నొక్కి వక్కాణించే వాదం
స్త్రీ వాదం॥

డా॥విజయలక్ష్మి పండిట్‌గారి కలం నుంచి మరెన్నో కవితలు వెలువడాలని ఆశిస్తూ, అభినందనలతో

- ముక్తేవి భారతి.
పద్మారావు నగర్,
సికింద్రాబాద్ - **500 025.**

# అభినందన

డా॥ బి. ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో డైరెక్టర్, ఎగ్జిక్యూటీవ్ కౌన్సిల్ మెంబర్‌గా ఉన్న నా చెల్లెలు విజయ అంటే ప్రో॥ పి. విజయలక్ష్మి పండిట్ రచించిన 'ఆకాశంలో అర్ధభాగం' అన్న కవితా సంకలనానికి పీఠిక రాయడం నా జీవితంలో ఒక మరువలేని అందమైన అనుభవం. విజయకు సృజనాత్మక రచనలో మాత్రమే కాకుండా సంగీతం, చిత్రలేఖనం, ఎంబ్రాయిడరీ పట్ల కూడా మంచి ఆసక్తి. అందమైన చిత్రాలను గీసి మా అక్కాచెల్లెళ్ళకూ, స్నేహితులకూ కానుకలుగా ఇచ్చింది. ముఖ్యంగా కలం, పెన్సిల్ స్కెచెస్, ఆయిల్ పెయింటింగ్స్ బాగా గీసింది. సుమారు ఇరవై సంవత్సరాలకు పూర్వం అంటే తాను ఎమ్మెస్సీ బాటనీ చదువుతున్న రోజుల్లోనే తాను వ్రాసిన ''అనుకుంటున్నాను'' అనే కవిత, ''అయితేనే నన్ను ప్రేమించు'' ('లవ్ మిదెన్' అన్న ఆంగ్ల గీతానికి చక్కని తెలుగు అనువాదం), కవితలు వనితలో ప్రచురించింది. విజయలక్ష్మి పండిట్ అన్న పేరు పత్రికలో చూచి మా ఇంట్లో అందరమూ సంబరపడటం నాకెంతో గుర్తుంది. కొంత విరామం తర్వాత విజయ తన మనసు స్పందించినపుడు వ్రాసుకున్న కవితలను **2005**లో ''మానవత్వమా ఏదీ నీచిరునామా?'' శీర్షికతో **43** కవితల సంకలనాన్ని ప్రచురించింది. పర్యావరణ పరిరక్షణపై దీర్ఘ వచన కవిత ''ధరిత్రీ విలాపం'' రెండవది. స్త్రీల సమస్యలపై ఈ కవితా సంపటి ''ఆకాశంలో అర్ధభాగం'' తన మూడవ కవితా సంపుటి.

డా॥ విజయలక్ష్మి పండిట్ స్త్రీ జీవితం, సమస్యల పట్ల తన ఆలోచలను సమర్థవంతంగా అభివ్యక్తీకరించిన ఈ కవిత సంపుటికి 'ఆకాశంలో అర్థభాగం' అనే సార్థకమైన శీర్షిక. స్వతంత్రమైన వ్యక్తిత్వంలో మంచి పరిశోధకురాలిగా, పరిపాలనా దక్షురాలిగా డా॥ విజయ లక్ష్మి పండిట్ విశ్వవిద్యాలయంలో అందరికీ పరిచయం. అయితే ప్రస్తుతం రచయిత్రిగా ఆమెలోని ఒక కొత్తకోణం కవిత రచనల్లో కనిపిస్తోంది. అన్ని కవితల్లోనూ స్త్రీవాద దృక్పథం అంత క్లుప్తంగా ప్రతిఫలించింది. ఈ వచన కవిత సంపుటిలో విజయ సుకుమార కవితా హృదయం అత్యంత సహజంగా, అర్ద్రంగా, మనోజ్ఞంగా ఆవిష్కరించబడింది. ఈ సృష్టిలో స్త్రీ పురుషులిరువురూ సమానులే. కాని సామాజిక పరిణామ క్రమంలో పురుషుడిలో ఆధిపత్య ధోరణి పెరిగి స్త్రీని శాసించే స్థితికి రావడం మానవత్వానికే మాయని మచ్చగా, సమాజ ప్రగతికది ప్రతిబంధకమయింది. విజయలక్ష్మి కవితల్లో కనిపించే సాధారణాంశం ఇది. మానవత్వం లేని ఈ రకమైన వైరుధ్యం పట్ల స్త్రీ మనస్సు పడే ఆవేదనే 'ఆకాశంలో అర్థభాగం'.

నాకు ఈ కవిత సంపుటి ప్రతి ఖండికలోనూ ' ఏదో ఒక ఆలోచన కనిపిస్తుంది. **30** ఖండికల్లోనూ **30** విధాలైన కవితా స్పందన కనిపిస్తోంది. బాల్యవివాహం, అనాధ శిశువులు- ఆడపిల్లల్ని బొన్సాయి మొక్కల్లాగా పెంచటం, గర్భాన్ని అద్దెకు ఇవ్వటం (సర్రోగేట్ మదర్) బాలికలపై అత్యాచారాలు, జోగిని (మాతమ్మ, వ్యవస్థ) కన్న తండ్రే కూతురిపై కాటువేయటం, ఆడపిల్లలపై జరుగుతున్న యాసిడ్ దాడులు, నరికివేతలు, ఇప్పటికీ కొనసాగుతున్న సతీ సహగమనాలు, ఆడశిశువుల భ్రూణహత్యలు, వంటింటి పొగలో ఆడవాళ్ళ మస్తిష్కాలు మసిబారిపోయిన తీరు, ప్రపంచీకరణలో భద్రత కోల్పోయిన

ఆడబ్రతుకుల వెతలు, వేకువ జామునుండి అర్ధరాత్రి దాకా మర మనిషిలాగా పనిచేసే అమ్మ దినచర్య, ఆడపిల్లలు పుట్టగానే శిశువు నోటిలో వడ్లగింజలు పోసి చంపే అత్తల కసాయి మనస్సు (స్త్రీకి స్త్రీయే శత్రువయిన వైనం), తాము బట్టలు నేస్తున్నా తమ ఒంటి మీద చిరుగు పాతలతో బతుకు బండి లాగుతూన్న చేనేత మహిళలు 'అచేతన మహిళల! గా మిగిలిన వైనం, 20 లీటర్ల నీటి కోసం 6 కిలో మీటర్లు నడిచి వెళుతున్న మహిళల దుర్భర జీవితాలు - ఇలా ఎన్నో అంశాలను రచయిత్రిగా విజయ ప్రస్తావించింది. కొన్ని కవితలు అత్యంత స్వాభావికంగా సాగితే, మరికొన్ని కవితలు ధ్వని ప్రతితంగా, సందేశాత్మకంగా రూపు దిద్దుకున్నాయి. ముఖ్యంగా బాల్య వివాహం, బోన్సాయ్ బ్రతుకు, మాయని మచ్చ, జోగిని, నేనూ మనిషినే, శిశిరం రాల్చిన కుసుమం అన్న కవితలు కంటతడి పెట్టిస్తూ కవయిత్రిగా విజయ సున్నితమైన హృదయాన్నీ, మహిళల పట్ల సానుభూతినీ, మహిళాభివృద్ధితోనే దేశాభివృద్ధన్న లోకజ్ఞానాన్ని స్పష్టంగా చాటుతున్నాయి. మహిళాలోకాన్ని గురించి ప్రజలను జాగృతిపరిచే ఎన్నో సామాజికాంశాలు ఈ కవితా సంపుటిలో ఆవిష్కరించబడినాయి.

అన్నిరంగాల్లోనూ స్త్రీ, దోపిడీకి గురి అవుతూనే ఉంది. అసలు స్త్రీని ఇంకా 'మనిషి'గా 'మానవి'గా గుర్తించే పరిస్థితి సమాజంలో లేదు. 'నేనూ మనిషినే' అన్న కవితలో రచయిత్రి ఒక మనుమరాలు బడికెళ్ళి చదువుకుంటానన్నప్పుడు, వాళ్ళ నాయనమ్మా ఇలా అరిచిందట! (సమాజంలో ఆడపిల్ల చదువు గురించి ఆలోచనా విధానం).

''నీకెందుకే చదువు ఆడముండా! ఇంట్లో పడుండక'' ఆ ఆడపిల్ల తన అక్షరాభ్యాసం తానే చేసుకుంది :

''తమ్ముడికి గుళ్ళో అక్షరాభ్యాసం
ఇంట్లో చాటలో బీము (బియ్యం)లో రాళ్ళేరుతూ
నేను దిద్దాను వచ్చీరాని శ్రీకారం
నా అక్షరాభ్యాసం నేను చేసుకున్నా.

అక్కడితో ఆగిపోయింది నా చదువు''.

ఈ అభివ్యక్తిలో గాఢత ఉంది. తరతరాలుగా ఆడవారికీ, చేటలోని బియ్యానికీ నడుమ ఉండే ముడిని విప్పి చెపుతున్న ఈ వాక్యాలు నన్ను బాగా ఆకర్షించాయి. కవిత్వంలో విషయం, అభివ్యక్తీ రెండూ ముఖ్యమేకదా !

నన్ను ఎందుకు మగపిల్లాడితో సమానంగా చూడరూ అని ప్రశ్నిస్తూ ఆడపిల్ల ఇలా వాపోతోంది.

''ఇంట్లో తిరగాడే ఆవుదూడకంటే,
కుక్కపిల్లకంటే పిల్లిపిల్లకంటే,
హీనమా నేను? (పు. 44)

అలాంటి స్త్రీకి పదమూడో ఏటనే పెళ్ళయింది. గర్భం వచ్చింది. తాను పుట్టడం, అమ్మ చనిపోవడం గుర్తుకు వచ్చి ఆ పిచ్చి పిల్ల తనకూ మగపిల్లాడే పుట్టాలని అనుకొందట.

''నేను ఆడదానినైనా

మగ బిడ్డయితే మేలని
రహస్య మనస్సు సందేశం (.. 51)

స్త్రీని స్త్రీ అసహ్యించుకునేలా చేసిన ఈ పురుషాధిక్య సమాజ క్రూరత్వాన్ని తలచుకుని తనలో తానే కుంగిపోయింది.

ఒక 'సగటు నాన్న'లో కూతురు ప్రగతి 'అమ్మ ఇంటి పనీ చేస్తుంది! ' ఉద్యోగానికీ వెళ్తొంది! నువ్వు మాత్రం ఇంట్లో ఏపనీ ఎందుకు చెయ్యవు! అని అడుగుతుంది. అప్పుడు ఆ నాన్న 'మీ అమ్మ ఆడది-నేను మగవాణ్ణి గనుక' అంటాడు.

'మీ అమ్మ ఆడది-నేను మగవాణ్ణి గనుక' అని స్త్రీని ' ఇంటి చాకిరీ'కి మరో రూపంగా చిత్రించిన మంచి కవిత 'సగటు నాన్న'.

ఆడబిడ్డ భారమనే ఆలోచనతో గర్భంలోనే ఆడపిల్లలకు సమాధి కట్టడం.

స్త్రీల మీద మగవారికి పెరుగుతున్న చిన్న చూపు, నిర్లక్ష్యం, అసహ్యం, ఆడపిల్లల సంఖ్య తగ్గిపోయి, చివరికి మనిషి జాతి మనుగడే ప్రశ్నార్థకం అవుతుందనీ, ఆ రోజు ఎంతో దూరంలో లేదనీ 'ఆకాశంలో అర్థభాగం'లో, ' ఓ ఏడమ్' కవితలో ' ఈవ్' చేసిన హెచ్చరిక సమాజానికి చురకలా తగులుతుంది.

స్త్రీ వాదానికి నిర్వచనాలు చెపుతూ, స్త్రీవాద భావజాల (ఐడియాలజీ) ప్రయోగాలను చాటి చెప్పిన కవిత 'స్త్రీవాదం'.

కవిత ఖండికల్లో రచయిత్రిగా విజయలోని కవితాత్మకత **(Poetic Element)** ప్రతిఫలించిన సందర్భాలు మచ్చుకు కొన్ని :

–  ఆడపిల్లల బతుకులు :

'వివక్షల విషచట్రాల్లో నలిగిపోతున్నామ్' (పు. 1)
'ఆడతనం తాటాకువేసి మూలకోర్చోపెట్టింది' (పు. 5)
'కసాయివాడి చేతికి చిక్కిన గొర్రెలా
విల విలలాడింది బాల్యం
వేటగాడి వలలో చిక్కిన అమాయక పక్షిలా
రెపరెప కొట్టుకుంది బాల్యం' (పు. 11)
'కాపలా కాయాల్సిన కనురెప్పే కంట్లో పడి బాధిస్తే
ఎవరితో చెప్పుకుంటుంది కన్ను' (పు. 25)
'నా తలలో దూరిన వంటింటి పొగ
నా మెదడును మసక బార్చింది'. (పు. 31)

చివరికి రచయిత్రి స్త్రీ విద్యావంతురాలై ఆత్మస్థైర్యంతో తన బ్రతుకును తానే మార్చుకోవాలి తప్ప ఎవరో వస్తారనీ ఏదో చేస్తారని అనుకోవటం తప్పని హెచ్చరిస్తుంది.

'నీ కన్నీళ్ళని నీవే తుడుచుకొని ముందుకు సాగిపో' (పు 76); 'ఆకాశంలో నీ అర్థభాగాన్ని ఆక్రమించుకోవడం నీ జన్మహక్కని'' (పు. 84) స్త్రీని హెచ్చరిస్తుంది.

''సృష్టిలో ఆడమగ
అర్ధనారీశ్వరతత్వం
ఒకటి లేకుంటే

ఇంకోదానికి మనుగడలేదు''

అని అనడంలో కవయిత్రిలోని 'భారతీయత' ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. స్త్రీ పురుష సమానత్వం చాటిన కవిత ఇది !

చక్కటి కవితా సంపుటి వెలువరించిన కవయిత్రి నా చెల్లెలు డా॥ విజయలక్ష్మి పండిట్‌కు శుభాకాంక్షలు.

హృదయపూర్వక అభినందనలు...

**- ఆచార్య పి. కుసుమ కుమారి**

ఉపకులపతి

శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం

అనంతపురం.

# కలం దూసి ...

స్త్రీల సమస్యల పట్ల లోతైన స్పందన, నిండైన సహానుభూతి ఈ కవితల లక్షణం. పేరుకిది కవితా సంకలనమే ఐనా, 'స్త్రీ సమస్య' అనే ఏకైక వస్తువు లక్ష్యంగా ఝుళిపించిన కలం కత్తితో ప్రజ్వలించే ఒక ఝాన్సీలక్ష్మి హృదయం పూసల్లో దారంలా ప్రత్యక్షరంలో ప్రసరిస్తున్నది. మగజాతి దౌర్జన్యాల పట్ల, సమాజంలో అడుగడుగునా ఆడవారికి మీదికి కోరలు చాస్తున్న బలివేదికల పట్లా అంచులు దిద్దుకున్న అసహనం, అసహ్యం, బాధ, క్రోధం ఈ కవితల్లో ప్రస్ఫుటమౌతుంది.

''ఆకాశంలో అర్ధభాగం'' అంటే - మానవ జీవితంలోనే కాక, సాంకేతిక వైజ్ఞానిక అభ్యున్నతి క్రమంలో మానవ సమాజ ప్రగతిని అనుక్షణం సరిసమానంగా నిర్వహిస్తున్న స్త్రీ'' - అని ప్రతీక ఈ కృతిలో అలాంటి ''స్త్రీ'' అనుభవపూర్వకంగా పడుతున్న కష్టనష్టాలనూ, అలమటించే అన్ని దశలనూ దిశలనూ, అన్ని కవితల్లోనూ సమగ్రంగా వర్ణించారు. ''కవితా విశారధ'' ఈ కవయిత్రి. స్త్రీ మానసిక వేదన, గృహ హింస, పురుష సమాజం నిరాదరణలో, నిర్దాక్షిణ్యంలో ప్రస్తుత సమాజంలోని ఎగుడు దిగుళ్ళు, ఒడుదుడుకుల వల్ల కలుగుతున్న కష్టాలు, కన్నీళ్ళూ అన్ని కరుణా విలచిత్తంతో చిత్రించడం జరిగింది. ''ఏకోరసః కరుణ ఏవ'' అన్న ఆర్యోక్తికి ఒక బలమైన నిదర్శనం ఈ కవితా సంపుటి. అన్నీ కాదు కానీ, మచ్చుకు కొన్ని ఈ సందర్భంలో.

''ఆడ నలుసుకు
అమ్మ కడుపులోనే

సమాధి కట్టేస్తుంటే''

(ఆకాశంలో అర్ధభాగం)

మానవ జీవితం రెండు పక్కల్లో మొదటిది 'జన్మ'. రెండోది 'స్థితి'. మరి అలాంటి పుట్టుకలోనే ఆడపిండం హత్యకు పథకాలు వేసే సమాజం ఎంత ఘోరం? ఎంత రాక్షసం?

''అన్ని కుటుంబాల్లో,
ఆడపిల్లలను పెంచే కళ
బోన్సాయ్ కళ ఒక్కటే''

(బోన్సాయ్ బ్రతుకు)

ఇది ఆడపిల్లల 'స్థితి'.

గర్భాన్నే అనేక పరిస్థితుల వల్ల అద్దెకిచ్చే గతి (సర్రోగేట్ మదర్) - మరో దుర్భర దైన్యస్థితి ఆడబ్రతుకుకు.

ఇలా ఆడజన్మ 'ఎదుగుదల' కడగండ్లన్నీ కళ్ళకు కట్టినట్టు వర్ణిస్తూ,

''ప్రేమ ప్రేమించిన వారికి
బ్రతుకునిస్తుందని
బ్రతకనిస్తుందని''

(ప్రేమోన్మాదం)

తెలియని - సహజ మనో వికాసం కోల్పోయిన, క్రూరజంతువుల లక్షణాలు పుణికి పుచ్చుకున్న - యాసిడ్‌తో హోళీ ఆడే, ఆడవారి తలలు తెంచే

- ఆధునిక యువకుల అక్రమ పాశవిక ప్రవృత్తులను తీవ్రంగా నిరసించారు కవయిత్రి.

"ఈసారికూడా ఆడపిల్లయితే
దాని నోట్లో కూడా వడ్లగింజలు పోస్తా"
(నేనూ మనిషినే!)

అనే అత్తింటినీ, మారుటితల్లి (పిన్ని)నే అమ్మ అనుకునే అమాయక ప్రాణినీ రసార్ద్రంగా ఆవిష్కరించారు.

'కట్నాల సెగలో
మాడి మసైపోతున్న
అభాగ్య మహిళలు ...
ఆడవారిపై అఘాయిత్యాలకు
సాగర్‌లో సాక్షులై తేలే
ఆడవారి శవాలు ....."
(హృదయం మరణించింది)

ఉన్నది ఉన్నట్లు అంగీరిస్తే నిజంగా గుండె పగలదా? ఈ వరుసలో ప్రాంతీయ మహిళల నీటిపాట్లు (20 లీటర్ల నీరు) ఒక విలక్షణ కవిత.

ఇలా మనసు నీరై పారే మగువ బ్రతుకును అణువు అణువుగా పరిశీలిస్తూ పరిశోధిస్తూ, రసార్ద్ర ప్రకృతితో పరిక్రమిస్తూ ఈ కవితా సంపుటి వెలయించిన కవిత్వ సోదరి శ్రీమతి డా॥ విజయలక్ష్మి పండిట్ - ఇలాంటి

దయనీయ జీవితం గడుపుతున్న స్త్రీని ఈ సమాజం ఉద్ధరించదనీ, స్త్రీని స్త్రీయే - స్వయంగా తానే పరిరక్షించుకోవాలనీ నిర్ణయిస్తూ

"నీ కన్నీళ్ళను నీవే తుడుచుకుని
ముందుకు సాగిపో".

(ఓ స్త్రీ ఎవరు తుడవాలి నీ కన్నీటిని?) అనే సంపుటి చివర సూచించారు - అసహాయ శౌర్యమే నిస్సహాయ స్థితిలో ఉన్న స్త్రీకి ఏకైక మార్గమనే ఉపదేశంతో.

ఈ సంపుటి ఒక ఉత్తమ 'స్త్రీవాద కవిత్వం'. ఈ కవయిత్రి లేఖిని మున్ముందు మరిన్ని గొప్ప కవితలకు సాహితీ సాగరంలో తెరచాప ఎత్తాలని మనసారా ఆకాంక్షిస్తూ, అభినందిస్తూ ....

- కవిశిరోమణి ఆచార్య రావికంటి వసునందన్.

# ఆకాశంలో అర్ధభాగం

ఆకాశంలో అర్ధభాగమై

జీవిత భారాన్ని సమంగా

మోసే ఆడవాళ్ళ బతుకులు

నేలపై కష్టాల ఊబిలో

కూరుకుపోతున్నాయి.

వివక్షల విషచక్రాల్లో

నలిగిపోతున్నాయ్

కట్నకానుకల

కామాంధుల

కాష్టాలలో కాలి

మాడి మసైపోతున్నాయ్.
అమ్మ కడుపులో పడ్డ
ఆడనలుసుకు
అమ్మ కడుపులోనే
సమాధి కట్టేస్తూంటే
కనుమరుగై పోతున్న
ఆడవారి సంఖ్య
కలవరపెట్టేస్తూంది
భవిష్యత్ కల్లోలాలను
కండ్లకు కడుతూ.
బెల్లం చుట్టూ ఈగల్లాగా
ఒక ఆడమనిషిని
పదిమంది మగాళ్ళు
పట్టి పీడించి ఆనందిస్తున్నట్టూ,
పెండ్లికూతుర్లు కరువై
ఒక ఆడది

అరడజను మందికి

భార్యయ్యై

బిడ్డల్ని కని

సంసారాన్ని మోసే

యంత్రమ్మై

కష్టాలలో కాగి

కొడిగట్టి కడతేరిపోతున్నట్టూ.

క్రమంగా ఆడవాళ్ళు

ఆనవాలు లేకుండాపోయి

భూమిపై మనిషి జాతి

మనుగడే ప్రశ్నార్థకమయ్యే

రోజులొస్తాయేమో!

# తీరని కోరిక

పలకబలపం పట్టి
బిగించి కట్టిన జడలతో
బడికెళుతూంది
అయిదో సంవత్సరంలో
అడుగిడిన భారతి.
'అ ఆ లు
ఒకటి రెండ్లు దిద్దిన
పలకను అమ్మ నాన్నకు చూపి
మురిసిపోయింది
తనూ బడికి పోతూందని

చదువుకుంటూందని.

మరో అయిదు సంవత్సరాలలో

ముంచుకొచ్చిన

ఆడతనం తాటాకు వేసి

మూలకూర్చోపెట్టింది.

బడి చదువు

కంచికెళ్ళింది.

ఇల్లాలై అత్తగారింట

అడుగు పెట్టిన భారతికి

చదువు తీరని కోరికై

గుండెలో

కొట్టుకుంటూంది.

# ఆడపిల్లనట

నాకూ గోలికాయలాట
జిల్లం కోడి ఆడాలనుది
కానీ.. నేను ఆడపిల్లనట
మొగవాళ్ళ ఆటలు
ఆడకూడదట!
మొగవాళ్ళ ఆటలు
  ఆడవాళ్ళ ఆటలు వేరా!
నాకూ అన్నతో బడికెళ్ళి
చదువుకోవాలని
డాక్టరమ్మనై ఆసుపత్రి పెట్టి

అందరికి సూదులేసి, మాత్రలిచ్చి...
కానీ... నేను ఆడపిల్లనట
చదువు అక్కర లేదంట
సంసారం చేసుకోడానికి
వంట, పెంటపనులొస్తే చాలంట
మొగపిల్లవాళ్ళకే చదువా!
ఆడపిల్లకు చదువొద్దా !
ఎందుకొద్దూ ?
ఆడపిల్ల మనిషికాదా ?
ఆడబిడ్డలను చదివిస్తే
తన బిడ్డలందరిని
చదివిస్తుంది. సంపాదిస్తుంది.
కుటుంబం బాగుపడుతుంది
దేశాన్నుద్ధరిస్తుంది.

# వలస పక్షులు

కూటికోసం

కోసుల దూరం

వలస వచ్చి

కూలిపని చేసుకుంటూ

చెట్టు క్రింద

కన్న బిడ్డకు పాలిస్తూ

కొమ్మపైని

వలస పక్షులకేసి

చూస్తు అనుకుంది లక్ష్మి ....

కొన్ని రోజుల క్రితం

ఎక్కడి నుండో వచ్చి వాలి
కొమ్మల్లో గూడు కట్టుకొని
గుడ్లను పొదిగింది ఆడపక్షి.
పిల్ల పక్షులకు తిరిగి తిరిగి
సేకరించిన ఆహారాన్నందించే
వలస పక్షీ నేనూ ఒకటే.
రేపు రెక్కలొచ్చిన పక్షులెగిరిపోతే
బాధ్యతలు తీరిన తల్లిపక్షి
తిరుగు ప్రయాణమై
స్వేచ్ఛగా ఎగిరి పోతుంది
తన పుట్టిన భూమికి.
కానీ, తనకెప్పుడు స్వేచ్ఛ ?
ఎప్పుడీ బాధ్యతలు తీరేది ?
బ్రతికున్నంతకాలం
కష్టాలు బాధ్యతలేనని
మూలిగింది లక్ష్మి మనసు.

# బాల్య వివాహం

బాల్యం శూన్యం
బలవంతపు సంసారం
బాలికల పాలిట శాపం
ఈ బాల్య వివాహం.
అమ్మ చేయి పట్టుకుని
రబ్బరు బొమ్మతో
కబుర్లు చెప్తూ
ముద్దులు మూటకట్టే
మాటలతో,
గలగల మనే

రంగు రంగుల గాజులతో,
గాలికెగిరే రంగురిబ్బన్లతో,
ఘల్లు ఘల్లుమనే గజ్జలతో
ఏ బాదర బందిలేని
ముక్కుపచ్చలారని
బాల్యం గొంతునులిమింది
బాల్యవివాహం.
తండ్రి వయసున్న
మగని చేతిలో పెట్టిన
ఆ నును లేత చెయ్యి
నలిగిపోతూంది.
కసాయి వాడి
చేతిలో చిక్కిన గొఱ్ఱెలా
విలవిలలాడిందిబాల్యం.
వేటగాడి వలలో చిక్కిన
అమాయక పక్షిలా

రెప రెప కొట్టుకుంది బాల్యం.
ఇంకెక్కడి బాల్యం ?
పుట్టుకతోనే ఆడపిల్లకు
మోయలేని భారం
మొదలవుతుంది
జీవిత పోరాటం.

# జీవితం పూసింది

చెత్త దిబ్బల్లోకి విసిరేసిన
విరిసి విరియని జీవితం.
ఏ అమానుష జీవుల
ఆకలి శరీరాల ఘర్షణలో
నాటుకున్న విత్తో !
వికసించకనే విసిరేసిందా
అమ్మతనం మృగ్యమైన
అమానుష మృగం.
కొన వూపిరి పసి మొగ్గ..
తల్లి వెచ్చదనం దూరమై,

అమ్మ స్తన్యం కరువై..
చలిగాలికి రెపరెపలాడే చిగురుటాకై
చలి చీమల బారినపడి
ఏడ్చేందుకు పెగలలేని
తడి ఆరిన గొంతుక.
అందుకుందా పసిమొగ్గను
ఓ అమృత హస్తం.
అక్కున చేర్చుకుంది
అమ్మకాని అమ్మహృదయం
అమ్మతనం స్పర్శ
పరుసవేది స్పర్శ
విరబూసిందా పసి మొగ్గ జీవితం.

# బోన్సాయ్ బ్రతుకు

చెట్లను గిడసబారేట్టు
పెంచే కళ బోన్సాయ్.
సహజంగా స్వేచ్ఛగా
పెరిగి ఎదిగి ఆనందించే
అవకాశాన్ని బలవంతంగా
అణిచి అరికట్టేందుకు
వేళ్ళను, కొమ్మలను, రెమ్మలను కత్తిరిస్తూ
తక్కువ నీరు, ఎరువు వేసి
అనుకున్న ఎత్తుకు
పెంచుకునేకళ.

బోన్సాయ్ చెట్లకు
వేళ్ళను కత్తిరిస్తున్న
మాధవీ లత మెదడులో
ఆడపిల్లల కాళ్ళు కత్తిరిస్తున్నట్లు
అలజడి...
కొన్ని దేశాల్లో
ఆడపిల్లల కాళ్ళ
సైజు పెరక్కుండా గుడ్డలతో కట్టి
పెంచే కళఉండేది.
ఇలాంటిదే కదా!
దాదాపు
అన్ని కుటుంబాల్లో
ఆడపిల్లలను పెంచేకళ
బోన్సాయ్ కళ ఒక్కటే...
పుట్టినప్పటి నుండి
కట్టుబాట్లు

సంప్రదాయాల
ఆంక్షల కత్తెర్లతో
ఆడపిల్లల శరీరానికి, మనస్సుకు
స్వేఛ్చకు కత్తెర్లేస్తూ
పెంచి పెద్ద చేసే కళ.
తరతరాలనుండి
ఆడపిల్లల్లో
సిగ్గు, బిడియం, భయం
అనే బీజాలు నాటి
చాలిచాలని తిండి పెట్టి
శరీరకంగా, మానసికంగా
బలహీనురాలుగా
పెంచే కళ...
చెట్ల వ్రేళ్ళను
కత్తిరిస్తున్న కత్తెరను
ఆవల పారేసింది

మాధవీలత.

చెట్లను ఆప్యాయంగా

పొదిమి పట్టుకుని

ఇంటి ఆవరణలో

పాదులు తీసి నాటి

ఎరువు, నీరు సంమృద్ధిగా పోసింది.

ఆనందంతో విప్పారిన నేత్రాలతో

ఆకాశానికేసి చూసింది.

ఇక ఆకాశమే హద్దు

ఈ చెట్లు పెరగడానికని.

ఆనందంతో

ఆత్మవిశ్వాసంతో

ఉన్నత వ్యక్తిత్వాలతో

ఆకాశమంత

ఎదిగిపోతున్న కూతుర్లు

మెదిలారు కండ్లలో...

# సర్రొగేట్ మదర్

పది నెలలకు

తన గర్భాన్ని

అద్దెకిచ్చింది ఆదిలక్ష్మి

తన స్వంత బిడ్డ

ఆకలి తీర్చేందుకు.

వ్యాకోచిస్తున్న

కడుపుకేసి

చూసి అడిగాడు

కొడుకు,

''నాకు చెల్లెలు

వస్తుంది కదమ్మా !

తన అద్దె కడుపులో

పెరిగి, పుట్టి

వాళ్ళమ్మ ఒడి

చేరుతుందని తెలిసినా

పేగుబంధంతో

వాడికి చెల్లలేనని

తలుస్తూ

ఊఁ ... కొట్టింది.

# మాయని మచ్చ

అభం శుభం ఎరుగని
ఆరేళ్ళ అమాయకత్వం
సంతరించుకున్న
ఒక అమ్మాయి రూపం
సంచి చంకకేసి
వెళుతూంది బడికి.
ఉచ్చనీచాలు విస్మరించిన
మగ మానవ మృగం
వెంటాడి వెంటాడి
చిదిమేసిందా
పసివాడని పసిమొగ్గను.

ఏం జరిగిందో
తెలియని అమాయకత్వం.
అమానుషత్వానికి
బలయిపోయింది
బంగారు బాల్యం.
అమ్మకోసం ఏడ్చుకుంటూ
ఇల్లు చేరిందా
చితికిపోయిన చిన్నారి.
అక్కున చేర్చుకుని
ఔదార్యగుణం మృగ్యమై
నిర్దాక్షిణ్యంగా
వీధిలోకి గెంటేసిన
ఆ తల్లి తండ్రుల దుశ్చర్య
మానవత్వానికే
మాయని మచ్చ.

# జోగిని

'జోగిని' అంటేనేమి
'మాతమ్మ' అంటేనేమి
మూఢనమ్మకాల చట్రాలలో
అభం శుభం ఎరుగని
ఆడబిడ్డల నిరికించి,
దేవుడికిచ్చి పెండ్లి చేసి
ఊరందరి ఆస్తిగా చేసి
అమాయక స్త్రీలతో
మగవాళ్ళ పబ్బం
గడుపుకునే వ్యవస్థకు

ఏ పేరు పెడితేనేమి ?

నవ నాగరికతనెక్కిరిస్తూ

సభ్య సమాజం తలదించుకునే

అమానుష వ్యవస్థలీ

జోగిని మాతమ్మలు.

సంఘంలో వెలివేయబడిన

ఆడబతుకులను

ఆ కష్టాల ఊబినుండి

రక్షించే వారేరి ?

# కంచే చేను మేస్తే!

కంటికి రక్షక భటులై
ఏ నలుసూ పడి బాధించకుండా
కాపలా కాయల్సిన
కనురెప్పలే కంట్లో పడి బాధిస్తే
ఎవరితో చెప్పుకుంటుంది కన్ను?
కనుపాపలా కాపాడుకోవాల్సిన
కన్న తండ్రే కన్న కూతురిని కాటేస్తుంటే
ఆ కామాంధునికి కూతురైన పాపానికి
ఎవరితో చెప్పుకుంటుంది ఆ కన్నె మనసు?

# ప్రేమోన్మాదం

కొందరు యువకుల
ప్రేమోన్మాదంతో
తెగిపడుతున్నాయి
యువతుల తలలు.
యాసిడ్‌లో మాడి మసైపోతున్నాయి
అందమైన అమ్మాయిల అందాలు
మహిళల మనోస్థైర్యాలు.
ఏం పాపం చేశారీ
అభాగినులు.
ఆడపిల్లగా పుట్టడమా ?

తమకూ ఒక మనస్సుందని
ప్రకటించడమా ?
తమ మనోస్థైర్యాన్ని
ప్రదర్శించడమా ?
తమ మనస్సును
చంపుకోకపోవడమా ?
ఎటు పయనిస్తున్నారీ
ఆధునిక యువకులు ?
అపర ప్రేమికులు.
యువకుల్లో సహజ
మనోవికాసం కోల్పోయి
క్రూర జంతువుల లక్షణాలు
ప్రకోపించడమే
ఈ ప్రేమోన్మాదానికి కారణం..
ఎవరు నేర్పాలీ
నవ యువ తరానికి

ప్రేమంటే త్యాగం

ప్రేమంటే క్షమ

ప్రేమంటే దివ్యానుభూతి

ప్రేమంటే ఓ అమర భావన

ప్రేమంటే ఆత్మార్పణమని.

ప్రేమ ప్రేమను ప్రేమిస్తుందని

ప్రేమ ప్రేమించిన వారికి

బ్రతుకునిస్తుందని

బ్రతకనిస్తుందని.

# బలవంతపు మరణశాసనం

సతీసహగమనం స్త్రీకి
ఎదగని సంస్కృతి రాసిన
బలవంతపు మరణశాసనం.
భార్యజీవితం భర్త కోసమని,
ఆమె జీవితం
అతనితోనే అంతమని,
పురుషాధిక్య సమాజం
హుకుం ఇది.
చరిత్రగమనంలో
పరిణతి చెందిన

ఆలోచనా సరళితో
'స్త్రీ' మనిషేనని
స్త్రీ స్వాతంత్ర్యాన్ని బలపరిచిన
ఎదిగిన మనుషుల
పోరాట పటిమ
'సతీసహగమన'
ఆటవిక శాసనాన్ని.
తుడిచేసినా!
ఎదిగిన సమాజంలో
ఎదగని మనుషులు
ఆచారాల పేరుతో
పునరావృతం చేస్తూంటారీ
అమానుష శాసనాలను.

# సగటు స్త్రీ

నా తలలో దూరిన
వంటింటి పొగ
నా మెదడును
మసకబార్చింది.
నాకంటూ స్వంత
ఆలోచనలు లేవు.
నా మెదడును
నియంత్రించే మీట
మా ఆయన చేతిలో ఉంది.
నా నిర్ణయాలకు

విలువెక్కడిది ?

అతని వెనకల

అడుగులేస్తూ

పోవడమే

నాకు తెలిసింది

నాకు నేర్పింది.

నేను ఒక

సగటు స్త్రీని.

# మరణం అంచున

నా ప్రాణం
ఈ వికృత రూపాన్ని
శరీరాన్ని వీడిపోదేం ?
మరణం అంచున
వ్రేలాడుతూ
మూలిగింది సునీత.
ప్రశ్నిస్తూంది ....
వికృత ప్రేమ భాధితురాలు
ప్రేమోన్మాదద్రావకం
'యాసిడ్' దాడిలో

మాడిన భౌతిక గాయాలకు
లేపనం పూసి చల్లార్చారు
కానీ...
దుఃఖం, అవమానం
అసహనం, నిస్సహాయత
కోపంతో
సలసలకాగుతున్న
మనస్సును చల్లార్చే
మందేదని ?

## ప్రపంచీకరణ

వరల్డ్ వైడ్ వెబ్
ఇంటర్‌నెట్
దేశాల మధ్య అడ్డుగోడలను
నిలువునా కూల్చేసి
ప్రపంచీకరణకు
నాంది పలికాయి.
విజ్ఞానం,
సమాచారం,
చదువు,
సంస్కృతి,

ఆలోచనలు

ప్రవహిస్తున్నాయి

ధారావాహికంగా.

నియంత్రణల

చెలియలి కట్టలు లేక

విచ్చలవిడిగా

సాగుతున్నాయి

ఆర్థిక లావాదేవీలు.

కట్టలు తెగిన నదిలా

కదం తొక్కుతూ

ఉప్పెనలా

ముంచుకొచ్చిన

ప్రపంచీకరణ

వెల్లువలో

మహిళలు, యువత

దిక్కుతోచక

దారి తెలియక

కొట్టుకుపోతున్నారు.
ప్రపంచ విఫణిలో
స్త్రీశక్తి యువశక్తితో
ఆకారం సంతరించుకున్న
సేవలు, సరుకుల
అమ్మకానికి పోరాటం.
విదేశీ సంస్కృతులు, వస్తువులు
స్వదేశీ వస్తువులను సంస్కృతులను
తుడిచిపెట్టేస్తుంటే,
విశృంఖల విదేశీ సంస్కృతుల
వెల్లువలో
యువతలోని విచక్షణ
అజ్ఞాతంలోకి
విసిరేయబడుతూంది.
మహిళల బ్రతుకులు
అన్‌సర్టెనిటీలోకి
నెట్టివేయబడుతున్నాయ్!

# అమ్మ దినచర్య

ఇంట్లో అందరికి
తెల్లవారేది చురుక్కున
సూర్యకాంతి తాకినప్పుడు.
అమ్మకు మాత్రం తెల్లవారేది
రాత్రి ఛాయలు వీడక ముందే
ఇంటి ముందు ముగ్గేసి
పాలు పితికి
ఫిల్టర్ కాఫీ డికాషన్
కలిపిన కమ్మని కాఫీతో
నాన్నను లేపాలి !
టిఫీన్‌లు, వంటవండి

అందరికి వడ్డించి
ఆఫీసుకు బడులకు
బాక్సులు సిద్ధంచేసి
పంపాలి.
అందరి విడిచిన బట్టలుతికి
ఆరేసి ఇస్త్రీలు చేయాలి...
అమ్మకు పని గంటలు రోజుకు
ఎనిమిదన్న
నియమంలేదు.
ఇంట్లో అందరూ రాత్రి
ఆకాశంలో చుక్కలు పొడవగానే
తినిపడకలేస్తారు.
అమ్మ మాత్రం
అర్ధరాత్రి అలసిన ఒళ్ళుతో
నిద్రకుపక్రమిస్తుంది
చాలీ చాలని
రాత్రి దుప్పటిని కప్పుకుని.

# నేనూ మనిషినే !

నేనూ మనిషినే!
నన్ను మనిషిగా
గుర్తించండని
మూగగా రోదిస్తుంది
బిడ్డకు పాలిస్తున్న సీత మనసు.
తన కళ్ల ముందు
తన పద్నాలుగేండ్ల జీవితం
సినిమా రీలులా
గిర్రున తిరిగిపోతూంటే
పద్నాలుగు ఏండ్లకే

నూరేండ్ల జీవితం అనుభవమై
ఆడ జన్మ ఎత్తినందుకు
చింతిస్తూంది.
జ్ఞాపకాలు
తన గతంలోకి పరుగుతీస్తున్నాయి.....
''అమ్మ కడుపులో నేను
పడినప్పటి నుండి
మొదలయ్యింది అమ్మకు
నాయనమ్మ సాధింపు,
''నాకొక మనవణ్ణి
కని చావు ఈసారి కూడా
ఆడపిల్లయితే
దాని నోట్లో కూడా వడ్లగింజలు పోసేస్తా!''నని.
అన్నంత పని అయింది.
రెండో సారి ఆడ పిల్లను కని భయంతో
అత్తకు మొహం చూపించలేకేమో

అమ్మ ఆత్మ గాలిలో
కలిసిపోయింది.
తోడును కోల్పోయిన నాన్న
నన్ను పరికించే నాన్న
ముఖంలో దుఃఖం, నిరాశ,
నిస్పృహ నిట్టూర్పు.
తల్లి లేని బిడ్డననే
తాత్కాలిక దయ
నన్ను బ్రతికించింది.
అమ్మ ప్రేమ నోచుకోని
ఆదరణ లేని బాల్యం.
నా అభాగ్య జీవిత ప్రస్తానం .....
నాన్న రెండో పెండ్లిలో
బుడిబుడి నడకలతో
సంబరమంతా నాదే
పిన్నిలో అమ్మను వెతుక్కుంటూ

కొంగు పట్టుకుని తిరిగాను.
కొన్ని రోజులు బాగానే గడిచాయ్
తమ్ముడు పుట్టడంతో
మొదలయినాయి
నా లేత మనసులో
అలజడులు, కష్టాలు.
కొడుకును కనినందుకు పిన్నిని
అందలమెక్కించింది నాన్నమ్మ.
ప్రేమతో తమ్ముని
తాకాలనే నన్ను
చీదరింపుగా దూరంగా నెట్టేస్తూ
వంశోద్ధారకుడిని పదే పదే
ముద్దాడేది.
వాడి అదృష్టాన్ని తలచుకుని
కన్నీరు కార్చే హృదయంలో
జవాబు దొరకని ఎన్నో ప్రశ్నలు !

నన్నెందుకు
ముద్దాడరు?
నేను ముద్దుగా బొద్దుగా
రబ్బరు బొమ్మలావున్నానుకదా !
ఇంట్లో తిరగాడే
ఆవు దూడ కంటే, కుక్క పిల్ల కంటే
పిల్లి పిల్ల కంటే హీనమా నేను!
అంత అప్యాయంగా
తమ్ముణ్ని పిలిచి ఎత్తుకుని
పాల బువ్వ పెట్టే
పిన్ని , నాన్నమ్మలకు
నా కడుపు ఆకలిపట్టదా!
ఆకలితో మాడుతూ
అమ్మా ! ఆకలని అడిగినా
కదలని కరుడుకట్టిన
అమానుషత్వం.

“దరిద్రపు గొట్టు ముఖం
ఎప్పుడు ఆకలే దీనికి..........
నానమ్మ చీత్కారాలు,
ఆడపిల్లంటే
ఎందుకింత అనాదరణ!
జవాబు దొరకని
చిక్కు ప్రశ్న!
తమ్ముని ఎత్తుకుని మోయడంతో
చెరువు దగ్గర నుండి
మోయలేని బిందెతో నీళ్లు మోస్తూ
పిన్నికి పని పిల్లలా
సాయం చేయడంతోనే
నా బాల్యమంతా గడిచిపోయింది.
అమ్మ ప్రేమ,
ఆనందించే జ్ఞాపకాలు
మిగలని బాల్యం.

ఎదురింటి

షావుకారు కూతురు వాణక్క

పుస్తకాల సంచితో స్కూలు డ్రెస్సుతో

చకచక నడుస్తూ

వెళుతూంటే,

గడపలో తమ్ముణ్ని చంకనేసుకుని

చూస్తున్న నాకూ

బడికి వెళ్లాలనే

తపన....

''నాయనా నేను బడికి

పోతా...చదువుకుంటా''...

నా మాటలు పూర్తికాకనే

గావుకేకలా అరిచింది

నాయనమ్మ.

''నీకెందుకే చదువు

ఆడముండా

ఇంట్లో పడుండక,''
నాన్న నోట్లో మాట
నోట్లోనే ఉండిపోయింది.
తమ్ముడికి గుళ్లో
అక్షరాభ్యాసం
ఇంట్లో చాటలో
బీములో రాళ్లేరుతూ
నేను దిద్దాను
వచ్చీరాని శ్రీకారం.
నా అక్షరాభ్యాసం
నేనే చేసుకున్నా.
అక్కడితో ఆగిపోయింది
నా చదువు.
తీరిక లేని బతుకు.
ఎదురెళ్లి తమ్ముడిని
ఎత్తుకు వచ్చి

నోట ముద్దలు పెట్టే
పిన్నికి నాన్నమ్మకు
నేనూ బిడ్డననే
సంగతి గుర్తుకురాదా?
పిన్నమ్మ, నాయనమ్మ
ఆడోళ్లే కదా!
ఎందుకు ఇష్టపడరు నేనంటే !
నా మనస్సులో
జవాబు దొరకని ప్రశ్న.
మగమహారాజు తమ్ముడికి
నీళ్లు తోడి పోయడం
వాడు తిన్న అన్నం కంచంఎత్తడం
వాడు ఏడ్వకుండా
ఆడించడం
అదేనా నా పని! నా విధి!
అదేనా ఆడ జన్మ విధి?

మగవాడి ఆనందం కోసమే
ఆడది పుట్టినట్టు.
ప్రకృతి సహజ స్త్రీత్వం
నన్ను పెద్ద మనిషిని చేసి
పదకొండేళ్ళకే నాకు
పెండ్లికి సర్టిఫికేటిచ్చింది.
నా శరీరంలో జరుగుతున్న
మార్పులు మనసులో
చెలరేగే అలజడులూ
ఏదో తెలియని అనుభూతి.
కోయిల కుహూరాలతో
ఎదిగే స్త్రీ సహజ కోరికల కలలు
ఊహల లోకంలో విహారం.
నిజ జీవితం నుండి
కాస్త ఉపశమనం కలిగించి
మరిపించి కరిగిపోయే కలలు.

నా పదమూడో ఏట

నా పెండ్లి రోజు వచ్చింది

నా ఇష్టాయిష్టాలతో

ప్రమేయం లేకుండా

ఇంటి ముంగిట్లో

నా పెండ్లి తాంబూలాలు.

పచ్చగా పసుపు పూసిన

నా శరీరానికి పట్టుచీర

కాళ్ళ పట్టీలతో చేతుల నిండా గాజులతో

పెండ్లి కూతురునయ్యాను.

పచ్చటి తాడుతో

నా మెడలో మూడు ముళ్ళేశాడు

ఈ పిల్ల ఇక నాదనే

గర్వపు చూపుతో !

మూడు రోజు ముచ్చట్లు

ఆడ బిడ్డల అమ్మలక్కల

ఆరళ్ళు.

మగని మురిపాలతో

తీరిక లేక అలసి పోయి

తూలిపోతున్న శరీరం...

పెండ్లి కూతురి ఘట్టం

గడిచిపోయింది.

ఇంటి కోడలిగా

ఇంట్లో పనుల భారంతో

రాత్రి తాగిన మైకంలో

ఇంటికి వచ్చే భర్త

కోరికల జ్వాలల్లో

హారతి కర్పూరంలా

కరిగి పోతూనే ఉంది

నా జీవితం.

కడుపులో పడ్డ నలుసు

ఆడా, మగా అనే సందేహం.

నన్నుకని చనిపోయిన
అమ్మే గుర్తుకొచ్చింది.
నేనూ ఆడదానినైనా
మగ బిడ్డయితే మేలనే
రహస్య మనస్సు సందేశం.'
అంతలో...
పాలుతాగుతూ
పయిట లాగుతూ
అమ్మ మొహంలోకి చూసి
బోసినవ్వులు చిందిస్తున్న
కొడుకు మొహంలోకి చూస్తూ
అనుకుంది సీత,
''ఈ మగమహారాజులు
ఈ సమాజాన్ని
ఎంతగా కట్టుదిట్టం చేశారు''!
స్త్రీనే స్త్రీ అసహ్యించుకుని

చీదరించేలా చేసిన

ఈ పురుషాధిక్య సమాజంలో

ఈ మనుషులు మారేదెప్పుడు

ఈ ఆడ బ్రతుకులు

బాగుపడేదెప్పుడు?

ఆడబిడ్డ మనిషేకదా

ఎందుకీ 'వివక్ష ?'

ఎప్పటికీ సీతను వీడని ప్రశ్న.

# ఎక్కడి వాళ్ళీ అనాథ బాలలు?

ఏ చెట్టునుండో
ఏ పుట్టనుండో
ఆకాశం నుండో
ఊడి పడలేదే ఈ బాలలు.
మరెక్కడి కర్కోటక హృదయాలు
వెలివేసిన అభాగ్యులో
ఈ అనాథలు?
చచ్చిన పిల్లను వీడలేక ప్రేమతో
కడుపుకంటించుకుని తిరిగే
కోతికున్న మమకారం లేనివాళ్ళా

ఆ తల్లి తండ్రులు !
పగిలిన గుడ్డు నుండి బయల్పడి
తడి ఆరని పిల్ల పక్షుల
సంరక్షణలో వంతులేసుకుని
ఆహారాన్ని తెచ్చి తినిపించి
రెక్కలొచ్చే వరకు పెంచే
పక్షులకన్నా భాద్యతారాహిత్యులా
ఈ అనాథలకు జన్మనిచ్చిన వారు?
ఈనిన దూడ ఒళ్ళంతా
ప్రేమతో నాకి తడి ఆర్పి
తన్మయంతో దూడకు పాలిచ్చే ఆవులా
అనురాగం పంచలేని వారా?
ప్రేమ, కనికరం, బాధ్యత, మానవత్వం
కన్నవారిలోనే కరువైతే
ఇక మనిషి మనుగడకు అర్ధమేమి?
జీవిత పరమార్థమేమి?

# శిశిరం రాల్చిన కుసుమం

ఎంత కష్టం
ఆ కుసుమానికి !
మోడు బారిన వృక్షం
అర్ధాంతరంగా రాల్చి వేసింది.
నేల రాలి పడిన బిడ్డ కేసి
నిర్లిప్త నిస్సహాయపు చూపు
కన్నతల్లి ఆఖరి చూపు.
కాలం కాని కాలంలో
ఆకు రాలే కాలంలో
పుష్పించిన

తన కడుపు పంటకు

కడుపు నింపలేని

అసహాయదుస్థితి.

మోడువారిన తల్లి దీనావస్థ !

ఆఖరిసారి ఆశగా అమ్మకేసి చూసి

ఆర్ధాంతరంగా కన్నతల్లి

కాళ్ళపై రాలిపోయిందా

శిశిరం రాల్చిన కుసుమం.

# స్త్రీ వాదం

దేనికోసం
స్త్రీ వాదం !
స్త్రీ ఒక మనిషేనని
ఆమెకు మనసుందని
తెలిపేది స్త్రీ వాదం,
స్త్రీ ఆత్మగౌరవాన్ని
వ్యక్తిత్వాన్ని
గుర్తించి గౌరవించమనే వాదం
స్త్రీ వాదం !
స్త్రీకి విద్య, వైద్యం,

స్త్రీ ఆర్థిక స్వాతంత్ర్యం
కనీసావసరాలని
చాటి చెప్పే వాదం
స్త్రీ వాదం !
స్త్రీలనణగదొక్కినంతకాలం
దేశాభివృద్ధి కల్లని
నొక్కి వక్కాణించే వాదం
స్త్రీ వాదం !

# ఓ... ఏడమ్

ఓ ... ఏడమ్....
నీవు నేను
ఒకసారికదా
భూమిపై
మనిషి రూపాలు
దాల్చింది.
మనసాహచర్యం
నుండి మనసంతతి
'మానవ సంతతి'
పుట్టుకొచ్చింది కదా...

ఆడ మగ అనే

తేడా లేకుండా

ఇద్దరం కలిసి పనిచేసేవాళ్ళం.

గుహల్లో జీవించే వాళ్ళం

ఆవులను గొర్రెలను పెంచాం

పంటలు పండించాం

చెకుముకురాయితో పాటు

మన ఆలోచనశక్తికి

పదునుపెట్టి

గృహాలుకట్టుకున్నాం

పత్తి పంటనుండి

వస్త్రాలు నేశాం

ఆహారధాన్యాలు

పండించుకున్నాం

నాగరికులమైనాం!

కానీ..

రానురాను

ఎందుకు నన్ను

రెండో పౌరురాలిగా

తీసి పడేశావ్...?

నన్ను గృహానికి

పిల్లలకు పరిమితం చేశావ్ ?

ఇద్దరం శారీరకంగా మానసికంగా

వైజ్ఞానికంగా

అభివృద్ధి చెందితే కదా

ఇద్దరం కలిసి

మానవాభివృద్ధి అనే

ఆకాశభారాన్ని మోసేది.

మానవజాతిని

గర్భంలో పదినెలల భరించి

కని పెంచి ఎల్లప్పుడు

కుటుంబ క్షేమం కొరకు

పాటు పడేనన్ను
నీతోటి మనిషిగా సమానంగా
నన్ను ఆదరించవెందుకు ?
జోడెడ్ల బండిలాగా
ఇద్దరం కలిసి మెలిసి
పరస్పర అభివృద్ధి కొరకు
ఇద్దరు పాటు పడితేనే
కుటుంభాభివృద్ధి
సాంఘికాభివృద్ధి..
దేశాభివృద్ధి.
నన్ను కట్నాలని కానుకలని
ఆడపిల్లలొద్దని
గర్భంలోనే వారికి
సమాధి కట్టేస్తే
మానవ జాతిని
భూమిపైకి తెచ్చే

‘ఈవ్’ ఆడబిడ్డ
పుట్టకుండా అడ్డుపడి
నన్ను హింసించి
నా ప్రగతిని అడ్డుకుంటే
మానవ జాతి క్షీణిస్తుంది.
ఎందుకంటే
సృష్టిలో ఆడమగ
‘అర్ధనారీశ్వరతత్వం’
ఒకటి లేకుంటే
ఇంకో దానికి మనుగడలేదు.
ఎడమ్...
నా (స్త్రీ) ప్రగతికి నీవు
అడ్డు పడితే
నీ ప్రగతికి నీవు
అడ్డు పడినట్లే !
ఈ సత్యాన్ని గ్రహించు.

# అచేతన మహిళలు

మరమనుషుల్లా
రాత్రనక పగలనక
కాళ్ళూ చేతులాడిస్తూ
రాట్నాలు మగ్గాలను
కీలు బొమ్మల్లా
ఆట్లాడిస్తూ!
పడుగు పేకలేస్తూ
రంగురంగుల పట్టుచీరలకు
ప్రాణం పోస్తున్నారు
చేనేత మహిళలు.

కూర్చున్న చోటినుండి కదలక
కండ్లల్లో ప్రాణాలతో,
దారాల దుమ్ము దూళినిండిన
వెలిసి పోయిన చీరలతో
వెలవెలబోతున్నారు
ఆ అచేతన మహిళలు.

# సగటు 'నాన్న'

నాన్నా...

నీవూ అమ్మా

ఇద్దరు జాబ్ చేస్తారు కదా..

మరి అమ్మమాత్రం

వంట, అన్ని పనులు చేసి

ఆఫీస్‌కు వెళ్తుంది కదా..

నీవు మాత్రం కాఫీ తాగుతూ

న్యూస్ పేపర్ చదివి

టిఫీన్ తిని రెడీ అయ్యి

హాయిగా ఆఫీసుకు వెళతావు.

అమ్మ అవస్థ గమనించిన
నాలుగేళ్ళ కూతురు ప్రగతి
అడిగింది నాన్నను.
''నీవు ఎందుకు పనిలో
అమ్మకు సాయం చేయ్యవు'' అని
''మీ అమ్మ ఆడది
నేను మగవాడ్ని గనక''
తపీమని సమాధానమిచ్చాడు
ఆ సగటు 'నాన్న'.
జవాబు అర్థంకాని
ప్రగతి మొహం నిండా
క్వశ్చన్ మార్కులు వెలిశాయి.

# హృదయం మరణించింది

ఆడబిడ్డ అక్కరలేదనే
తిరస్కార పరీక్ష ఫలితంగా
తల్లి గర్భంలో కరిగిపోతూ
కన్నీటిచుక్క రాల్చిన
ఆడపిండం ....
ఆఘ్రాణించి నులిమేసిన
లేత గులాబి మొగ్గలు ....
ప్రేమోన్మాద ఆసిడ్ ద్రావణంలో
కట్నాల సెగలో
మాడిమసై పోతున్న

అభాగ్య మహిళలు ...
ఆడవారిపై అఘాయిత్యాలకు
సాగర్‌లో సాక్షులై తేలే
ఆడవారి శవాలు ...
ఎడతెగని 'స్త్రీ' దహనకాండ
కంతంలేదా?
విలువలు కరువై
హృదయం మరణించి
శిలలై, శవాలై తిరుగాడే
దేహాల సమూహమై
మిగిలిందీ మానవ సమాజం.

# 20 లీటర్ల నీరు = ఆరు కిలోమీటర్లు

ఏం జీవితం

ఈ ఆడవారి జీవనం.

ఇరవై లీటర్ల

నీళ్ళ బిందెను

చంకకు నెత్తికి

మార్చుకుంటూ

చిన్న బిడ్డను

మోసే జాగ్రత్తలో

రెండింతల జాగ్రత్త ....

నీళ్ళు

మట్టిపాలు కాకుండా.
ఆరు కిలో మీటర్ల దూరం నడిచి
నీళ్ళు మోసి అలిసి
ఇంటికొచ్చి
అందరికి దాహం తీర్చి
తమ గొంతు తడుపుకోడానికి
గుక్కెడు నీళ్ళు మిగలని దుస్థితి.
దూరతీరాలనుండి
నీళ్ళ బిందెలు
మోయడమే
ఎందరో
ఆడవారికి
పెద్ద దినచర్య.

# అమ్మతనం

ఏ బిడ్డలను
నవమాసాలు మోసి
ఈ భూమిపైకి
ప్రసవించిందో
ఆ తల్లి
ఎన్ని కష్టాలలో కాగి
తిండి లేక మాడి
బీటలు వారింది
నల్ల రేగడి నేలలా
ఆ శరీరం

ఈగలకు చీమలకు
ఆహారమై
పేవ్‌మెంట్
పాలయింది
మూర్తీభవించిన
అమ్మతనం.
తల్లిని చాకటానికి
వంతులేసుకుని
భారమై
వీధిపాలు చేసిన
నికృష్టపు సంతానం.
అమ్మకు విలువకట్టే
కొలమానం ఉందా
ఈ లోకంలో?

# ఓ స్త్రీ ఎవరు తుడవాలి నీ కన్నీటిని?

నీవు చిన్న పాపగా ఆకలికి ఏడ్చినపుడు
అమ్మ నీ కన్నీళ్ళు తుడిచి
ఆప్యాయంగా బువ్వపెట్టి పెంచింది.
నీవు బుడిబుడి నడకలతో తడబడుతూ పడి ఏడ్చినప్పుడు
కాలిలో ముల్లు గుచ్చుకుని గిలగిలలాడినప్పుడు
తల్లడిల్లిన నాన్న మనసు నీ కాలిలో ముల్లుతీసి
నీ కన్నీళ్ళు తుడిచింది.
నీవు చదవడం లేదని టీచరు కొట్టిందని ఏడ్చినప్పుడు
నీ కన్నీళ్ళను తుడిచి నీకు విద్యాబుద్ధులను నేర్పి
నీ విద్యే నీ అభివృద్ధికి మూలమని

నిన్ను విద్యావంతురాలిగా తీర్చిదిద్దారు
నీ తల్లి, తండ్రి, గురువులు,
వారి హితబోధలు కావాలి నీ భవిష్యత్ సోపానాలు.
వైజ్ఞానిక, సాంకేతికాభివృద్ధి ఆకాశానంటుతున్నా
మానవీయ గుణాలు లోపించి,
నైతికంగా అధఃపాతాళాన్ని చేరుకొంటూంది సమాజం
హింసా ప్రవృత్తి పెరిగి మృగాల కన్నా హీనంగా ప్రవర్తించే
మనుషుల మధ్య జీవితాన్ని సాగించడానికి
ధైర్యాన్ని, స్థైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని కూడకట్టుకొని
సంఘాన్ని, జీవితాన్ని  నిరంతరం చదువుతూ
జీవితం పట్ల అవగాహనతో
ధైర్య, సాహసాలతో, ఆత్మ విశ్వాసంతో విద్యాధికులై
సంఘంలో పరిణితికి ప్రగతికి మారుపేరై నిలిచిన
స్త్రీమూర్తుల స్ఫూర్తితో కష్టాలనెదుర్కొంటూ
బాధలెదురయినపుడు దుఃఖాన్ని దిగమింగి
నీ కన్నీళ్ళను నీవే తుడుచుకుని ముందుకు సాగిపో.....

# మేలిముసుగు

ఆడతనం అందాన్ని

ముఖారవిందాన్ని

ముసుగేసి మరీ

దాచిపెట్టి

ఆ ముసుగుకు

నగిషీలు చెక్కి

మేలిమి బంగారంలా

మేలి ముసుగని

నామకరణం చేశారు.

తలమీదుగా

ముఖాన్ని

మనస్సును

మేనిని కప్పి

తరతరాలుగా స్త్రీలను

ఇంటి గడప

దాటనీయకుండా

ఎవరు చూడకుండా

ఏమి వినకుండా

బయటి ప్రపంచానికి

దూరం చేశాయీ

పరదా కట్టుబాట్లు.

ఇల్లే నీ సర్వస్వమని

వంటిల్లే నీ స్థానమని

భర్త, పిల్లలే నీ ప్రపంచమని

ఆడవారి ఆలోచనలను

బుద్ధిని, మనస్సును

కండిషన్ చేసి

తరతరాలుగా

ఆడవాళ్ళను

బడిబాటను తొక్కనీక

ప్రగతి బాటలో నడవనీక

నిషేధించిన ఈ

పురుషాధిక్య సమాజం

ఎంత తప్పు చేసిందో

ఊహించేలోగా

కాలం కరిగిపోయింది

దేశాభివృద్ధి కుంటుపడింది.

స్త్రీ స్వాతంత్ర్యానికి

స్త్రీ మనోవికాసానికి

అంతరాయమై నిలిచిన

మేలిముసుగు

ఇప్పుడిప్పుడు

జారిపోతూంది

మెల్లమెల్లగా.

మబ్బుల పరదాల

చాటునుండి మెల్లమెల్లగా

చంద్రికలను వెదజల్లుతూ వచ్చిన

పూర్ణచంద్రునిలా

మెరిసే కండ్లతో

ఆకాశం వైపు

చూస్తూంది స్త్రీ

ఈ విశాల విశ్వం మాదికూడా

అనే ఆత్మవిశ్వాసంతో.

# నీ (స్త్రీ) జన్మ హక్కు

ఓ .... స్త్రీ!
ఈ నిర్వేదం
నిస్సత్తువ
నీకెందుకు?
నీవూ ఒక మనిషేనన్న
స్పృహ నీకే కలగాలి
ఎవరో కలిగించేంత వరకు
స్పృహ కోల్పోయావా!
ఏదీ నీకు భవిష్యత్తు?

ఆడ మగ అనే

లింగభేదం

ప్రకృతి సిద్ధం

కేవలం సృష్టి కార్యార్థం

అన్ని శక్తులు

స్త్రీ పురుషులలో సమానంగా

నిద్రాణమై ఉన్నాయన్న

నిజాన్ని గుర్తించు

వాటిని మేల్కొలపడమే

నీ తక్షణ కర్తవ్యం

నీ నరనరాల్లో

నీ రక్తంలో థావుగా

ఇంకిపోయిన

తరతరాల

స్త్రీ బానిసత్వపు వాసనల్ని

ఆఘ్రాణించడం మానుకో.

చరిత్ర శిధిలాల్లో
శిలాజాలై నలిగిపోయి
దాగిపోయిన
పురాతన జ్ఞాపకాలను
ఆచారాలను, ఆలోచనలను
త్రవ్వి తలకెత్తుకోవడం మాని
విప్పారిన జ్ఞాన నేత్రాలతో
తలను సగర్వంగా
పైకెత్తి చూడు,
నీ ఆలోచనలు
నీ ప్రగతి విస్తరించడానికి
ఆకాశమే హద్దని
ఆత్మవిశ్వాసంతో
సృజనాత్మక
ఆలోచనా నిచ్చెనలేసి
ప్రగతిపథంలో

పురుషుడితో

సమానంగా పయనిస్తూ

ఆకాశంలో

నీ అర్థభాగాన్ని

ఆక్రమించుకోవడం

నీ (స్త్రీ) జన్మ హక్కని తెలుసుకో!



# ఆకాశంలో అర్ధభాగం

## Aakasamlo Aarthabagham

### కవితా సంపుటి


పేరు : ప్రొ॥ డా॥ పి. విజయలక్ష్మి పండిట్

విద్య : M.Sc. (Botany), M.A. in Distance Education,
Master in Women Studies, Ph.D. (Education).

వృత్తి : డైరెక్టర్, ప్రొ॥ రాంరెడ్డి రిసెర్చ్ అకాడమీ ఆఫ్ డిస్టెన్స్
ఎడ్యుకేషన్
డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం,
హైదరాబాద్.

ప్రవృత్తి : సాహిత్యం, కవితలు, కథలు, చిత్రలేఖనం,
ఫ్రీలాన్స్ రచనలు, పుస్తక పఠనం.

**ముద్రిత రచనలు**

సాహిత్యం : "మానవత్వమా ఏదీ నీ చిరునామా?" (వచన కవితా
సంపుటి -2005)
"ధరిత్రీ విలాపం" (దీర్ఘ వచన కవిత) జులై 2009
"ఆకాశంలో అర్ధభాగం" (వచన కవితల సంపుటి) జులై 2009

దూరవిద్య : నాలుగు గ్రంథాలు, రెండింటికి 'ఎడిటర్'

ముద్రణలో వున్నవి : రెండు వచన కవితా సంపుటిలు
నా నీలు (సంపుటి)

E-mail : p_vijayalakshmipandit@yahoo.co.in